# ప్రవృత్తి

"పిల్లదాన్ని డాటర్ బాబుకు మాపీవా - ఒళ్ళు కాలి పోతున్నది.... నీకేం పట్టదు. ఆ సంఘం సంఘం అంటూ ఊళ్ళుపట్టుకు తిరుగుతున్నావు!" మా లచిమి గయ్‌మని మొగుడు రాజయ్య పైన లేచింది.

రాజయ్య విస్తుపోయాడు.

ఎలెచ్చన్లు వస్తున్నాయి. పల్లెల్లో బోల్డు కోలాహలం! నాయకుల వెంట తిరిగే వాళ్ళకి బోల్డు డబ్బులు - సారా!

రాజయ్యకు ఒక పార్టీ అంటూ లేదు - ఎవరు పిలిస్తే వారెంబట తిరగడం - నాలుగు డబ్బులు సంపాదించుకోవడం.

ఉత్తప్పుడు కూలో - నాలో చేసుకు బతకడం! తాతల నాటి కొంప ఒకటి ఉంది... ఒక ఎకరా పొలం ఉంది... అది గాక మాలచిమి కూడా పన్లోకి పోతూ ఉంటుంది.

"అదేంటే... ఈ ఊళ్ళో డాక్టరున్నాడుగా... సూపకపోయావా?" విసుగ్గా అన్నాడు.

"ఆడు ఇండినన్లు మూడు చేసిండు గానీ... జోరం తగ్గలేదు- అయినా ఏ రోగం వచ్చినా అవే సూదులు కదా వాడు వేసేది" మాలచిమి చెప్పింది.

అవును. అలానే ఆ ఊళ్ళోవాళ్ళు అనుకుంటారు. నరసరాజు ఆ ఊళ్ళో ప్రాక్టీసుచేస్తున్నాడు. అతను చదివింది ఆయుర్వేదం - ఇచ్చేది ఇంగ్లీషు మందులు.

పేషెంట్ రాగానే పొడుగాటి సూది తీసుకుని పశువులకు గుచ్చినట్లు గుచ్చి - ఓ పెన్సిలిన్ ఇంజక్షన్ ఓ. బి. కాంప్లెక్సు - ఇంకా ఏ పెరాస్టిమాలో ఏదో ఒకటి మొత్తం మూడు సూదులు గుచ్చుతాడు.

మొదట్లో మాత్రలు ఇచ్చేవాడు. అందుకుపల్లెటూరు జనం కోప్పడి సూది ఎయ్యమనేవారు. నువ్విచ్చింది మాత్రేగా - ఇదిచాల్లే అని అర్ధ రూపాయో - రూపాయో పారేసి పోయేవారు.

అందుకని అప్పటి నుండి అవసరమున్నా లేకపోయినా ఓ మూడు సూదులు గుచ్చేస్తాడు నరసరాజు.

ఇవన్నీ రాజయ్యకు తెలీదు కానీ - మూడు సూదులు గుచ్చినా తగ్గలేదంటే... అది పట్టణం తీసుకుపోవలసిన జబ్బని అతని ఉద్దేశ్యం!

రాజయ్య తన గురువు గురవయ్య దగ్గరకొచ్చి పైసలడిగి విషయం చెప్పాడు. గురవయ్య ఓ మాదిరి లీడరు - అందుకని తనకు తెల్సినా తెలీకపోయినా అన్నీ తెల్సినట్లే చెబుతాడు.

"సూడూ ఈ రాజుగాడు ఒట్టి యూస్‌లెస్ ఫెలో! వెంటనే కర్నూలుకు తీసుకునిపో అక్కడ కూడా - జనరల్ ఆసుపత్రికి పోమాకు - ప్రైవేట్ డాక్టరైతే వెంటనే తగ్గిస్తాడు. అతగాడి ఫీజు అతడికి పారేస్తావ్ కాబట్టి, ఇదిగో ఈ ఆరొందలుంచు - నువ్వు చేస్తున్న పనికి అడ్వాన్సుగా ఇస్తున్నాను."

ఎలాగూ మూడు రోజులుగా జొరంగా ఉంది కాబట్టి... మాలచిమిని తీసుకుని పిల్లదాన్ని భుజాన వేసుకుని రెండు గంటలు ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణం చేస్తే ఓ డాక్టర్ పేరు తెలిసింది.

తీరా అక్కడికి చేరుకున్నాక - ఆ డాక్టరు ఇంకా రాలేదు. ఓ గంట నిరీక్షించిన తర్వాత వచ్చాడు, కాంపోండర్‌తో అంతకుముందే బాతాఖానీ వేసుకుని - కాఫీ తాపించి ఉండడంవలన ముందు ఇతగాణ్ణిలోనికి పంపాడు., చేంతాడు క్యూ ఉన్నా సర్దిచెప్పి.

డాక్టర్ రావు డి. కె. ఓ పదినిముషాలు పరీక్షించాడు. నాలుక చాపమన్నాడు. సుత్తితో పొట్టమీద కొట్టాడు. స్టెత్ చూశాడు. ఇంకా చాలా చేశాడు.

రాజయ్యకు తృప్తి కలిగింది, పోగానే ఇంజక్షన్లు ఇవ్వకుండా పిల్లదాన్ని పరీక్ష చేస్తున్నందుకు.

"బాగా ముదిరిపోయింది... ఇదిగో... ఈ టెస్టులు ఈ పక్కనున్న గోవిందా ల్యాబ్‌లో చేయించి రేపు రిపోర్టులు పట్టుకురా –" డాక్టరు ఓ బారెడు లిస్టు రాసిచ్చాడు.

"మాదీవూరు కాదండి... ఇవన్నీ ఈ రాత్రికి అయిపోతాయి?" రాజయ్య అమాయకంగా అడిగాడు.

"తొందరపడితే లాభం లేదయ్యా! రేపటికి కాని రిపోర్టులు రావు – కావాలంటే లాడ్జి తీసుకో–" విసుక్కున్నాడు.

"సరే! డాక్టర్ బాబు! ఇక్కడే ఉంటాం..." పోబోయాడు.

"నా ఫీజు యాభై!" చెప్పాడు తాపీగా రావు డి. కె.

"మళ్ళీ వస్తాం గదా..." రాజయ్యకి అనుమానం వచ్చింది.

"అది రేపటి సంగతి... ఇప్పుడు నాకు అరగంట టైం వేస్టుకాలే... రేపు కన్‌సేషన్ ఉంటుందిలే!" కరుగ్గా చెప్పాడు.

రాజయ్య మాట్లాడకుండా యాభై ఇచ్చి బయటపడ్డాడు. గోవిందా ల్యాబ్‌ను కొంచెం కష్టపడి సందులు, గొందులు! గాలించి పట్టుకున్నాడు.

రోడ్డు మీద లేని ల్యాబ్ ఎందుకు రాసినట్లో! అని ఒకింత ఆశ్చర్యపోయాడు కూడా!

"రండి .... రండి డాక్టర్ రావుగారూ పంపారా!" పరమానందం వీరి ముగ్గురిని చూడగానే అడిగాడు.

"ఆఁ! టెస్టులు చేయాలి...." రాజయ్య చీటీ ఇచ్చాడు.

"నీకే! బాగున్నావు కదయ్యా!" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు పిల్లదానికి... ఒసే నూకాలు.... భయం లేదు ఇటుచూడూ.." బల్ల మీదకు దించాడు బక్క చిక్కి పోయిన నూకాలును మాలచిమి భుజం నుండి అందకుని.

"ఏం జబ్బు?" పరమానందం లిస్టు చూసి అడిగాడు.

"జరం.... దగ్గు" చెప్పింది మా లచిమి.

"డబ్బులు తెచ్చారా..." పరమానందం రంగం సిద్ధం చేసుకుంటూ అడిగాడు రాజయ్య.

"ఎంత!" గొంతు తడారిపోతూంటే అడిగాడు రాజయ్య.

"రెండొందలు ...."

"ఆఁ! అంతడబ్బే!"

"మరి యక్స్‌రే తియ్యాలి..... మూడు రకాల బ్లడ్ టెస్టులు చేయాలి... ఇంకా అవసరమైతే స్కానింగ్ చేయాలి."

రాజయ్య మా లచిమి వంకచూశాడు. ఆమె అయోమయంగా చూసింది. ఒక్క క్షణం ఆలోచించాడు......... పిల్లదానికి జబ్బు తగ్గడం ముఖ్యం. డబ్బు తగ్గినా ఫర్వాలేదు జేబులో...

అన్నీ తీసుకుని మరునాడు ఉదయం రమ్మన్నాడు పరమానందం. రెండొందలు తీసుకుని రసీదు ఇచ్చాడు కూడా.

లాడ్జీలు చుట్టూ తిరిగి ఓ యాభైకి ఓ మాదిరి రూము సంపాదించగలిగాడు. రాత్రికి ముగ్గురుతలదాచుకున్నారు అందులో.

మరునాడు రిపోర్టులు తీసుకుని డాక్టర్ రావు డి.కె.కి చూపాడు. ఆయన మళ్ళీ ఓ చేంతాడు అంత ముందుల లిస్టురాసి ఓ పాతిక ఫీజు వసూలు చేశాడు.

"వారంలో తగ్గిపోతుంది... ఏం భయంలేదు!" అని భుజం తట్టి పంపించాడు. పోయేముందు ఆ మందులు ఫలానా షాపులోనే కొనమని పంపించాడు.

మందుల ఖర్చు ఇంకా రెండొందలయింది. జేబులో బస్సు చార్జీలతో తిరుగు ప్రయాణం కట్టాడు. బస్సుదిగి వస్తూంటే నరసరాజు ఎదురొచ్చాడు.

ఎక్కడ నుండి వస్తున్నారని విచారించి కనుక్కున్నాడు.. ఆ రిపోర్టులు.. ఆ మందుల లిస్టు చూశాడు.

"ఏం చేస్తాం! మీ కర్మ నాకు పది రూపాయలు ఇవ్వడానికి ఏడ్చి చస్తారు. అక్కడికిపోయి అయిదొందల దాకా గొరిగించుకున్నారు... ఈ జబ్బుకు ఈ టెస్టులక్కరలేదు... మందులూ అక్కరలేదు.."

"మరి ఎందుకు ఇచ్చినట్లు..." అర్థంకాక అడిగాడు రాజయ్య.

"కమీషన్...కమీషన్ కోసం... టెస్టుల్లో యాభై శాతం కమీషన్... మందుల్లో ఇరవై నుండి ముప్పై శాతం కమీషన్ డాక్టర్‌కు ముడుతుంది. ఇవన్నీ రాయకపోతే ఆ డాక్టర్‌కు డబ్బులొచ్చేదేలా?" నరసరాజు వెటకారంగా నవ్వాడు.

రాజయ్య, మాలచిమి అవాక్కులైపోయారు. అతను చెబుతున్నది నిజమో, అబద్ధమో తెలియక!

(1-3-1996 అమృత్ పత్రిక)

